క్లుప్తంగా

సోలార్ రక్షిత పథకానికి మరమ్మతులు



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్

సీతంపేట: గెడ్డగూడ సోలార్ రక్షిత పథకానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మర్మతులు చేపట్టారు. ఈ నెల 4వ తేదీన మూలకు చేరిన సోలార్ రక్షిత పథకం శీర్షికన సాక్షిలో ప్రచురితమైన వార్తకు సంబంధిత అధికారులు స్పందించారు. డీఈ మధుసూదనరావు నేతృత్వంలో సిబ్బంది గ్రామాన్ని సందర్శించారు. పైప్‌లైన్‌తో పాటు మోటార్ రిపేరు చేయడంతో ఇప్పుడు పని చేస్తుంది.

అడవుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి



అటవీ శాఖ సిబ్బందికి సూచనలు చేస్తున్న రేంజర్ గంగరాజు

గుమ్మలక్ష్మీపురం: కురుపాం అటవీ రేంజ్ పరిధిలో గల అడవుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు రేంజర్ డి.గంగరాజు తెలిపారు. రేజంర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఆయన బుధవారం గుమ్మలక్ష్మీపురం సెక్షన్ పరిధిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎల్విన్‌పేట, పి.ఆమిటి బీట్ల పరిధిలో ఏర్పాటు చేసిన ప్లాంటేషన్లను, అటవీ ప్రాంతాల్ని పరిశీలించారు. అనంతరం స్థానిక సెక్షన్ ఆఫీస్ వద్ద విలేకర్లతో మాట్లాడుతూ.. కలప అక్రమ రవాణాను సహించేది లేదని, అటవీ ప్రాంతంలో అనుమతులు లేకుండా చెట్లు నరకడం, అక్రమంగా తరలించడం వంటి చర్యలకు పాల్పడుతూ పట్టుబడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. రెండు రోజుల క్రితం ఖడ్గవలస జంక్షన్ వద్ద అక్రమంగా తరలిస్తున్న రూ.1.40 లక్షలు విలువ చేసే కలపను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రేంజ్ పరిధిలో 20 హెక్టార్లలో 50 వేల టేకు మొక్కలు నాటినట్లు చెప్పారు. రానున్న సీజన్‌లో 25 హెక్టార్లలో 62,500 టేకు మొక్కలు నాటనున్నట్లు వెల్లడించారు. అటవీ ప్రాంతాన్ని సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఎక్కడైన కలప అక్రమ రవాణా జరిగినట్లయితే 9440082130 నంబర్‌కు సమాచారం అందివ్వాలని కోరారు. ఆయన వెంట అటవీశాఖ సిబ్బంది ఉన్నారు.

మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు



మూలజమ్ములో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి

గుమ్మలక్ష్మీపురం: వరి, పత్తి పంటల్లో మోతాదుకు మించి ఎరువులు వాడకూడదని మండల వ్యవసాయాధికారి సీహెచ్ ప్రసాద్ అన్నారు. మండలంలోని మూలజమ్ము, వప్పంగి గ్రామాల్లో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు భూసార పరీక్షలు, ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. భూసార పరీక్షల ఆధారంగా పంటకు ఎరువులు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ విభాగం మండల కోఆర్డినేటర్ గణేష్‌చంద్ర, లుంబేసు సర్పంచ్ తోయక చిలకమ్మ, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు సకాలంలో టీకాలు తప్పనిసరి

పార్వతీపురంటౌన్: చిన్నారులకు సకాలంలో టీకాలు తప్పనిసరని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎం.నారాయణ అన్నారు. ఈ మేరకు పట్టణంలోని 15వ వార్డులో వ్యాధినిరోధక టీకా కార్యక్రమాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. షెడ్యూల్ ప్రకారం టీకాకు అర్హులైన పిల్లలు, గర్భిణుల వివరాలు, గడువు తేదీలను, టీకా కార్డుల్లో పరిశీలించారు. వ్యాక్సిన్ కాల పరిమితి తనిఖీ చేశారు. ఐదేళ్ల లోపు పిల్లలకు సకాలంలో టీకా వేశారా? అని, ఎవరైనా డ్రాపౌట్స్/లెఫ్ట్ ఔట్స్ ఉంటే గుర్తించి టీకా పూర్తి చేయాలని సూచించారు. టీకాలు వేయడం పూర్తయిన వెంటనే కార్డులో నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

కొండచీపుర్ల కొనుగోలులో వ్యాపారులదే హవా

- ఏటా తగ్గిపోతున్న జీసీసీ కొనుగోలు
- నష్టపోతున్న గిరిజనులు
- లాభపడుతున్న వ్యాపారులు



గిరిజనులు విక్రయించడానికి మార్కెట్‌కు తెచ్చిన కొండచీపుర్లు

సీతంపేట: కొండచీపుర్ల కొనుగోలులో గిరిజన సహకార సంస్థ కంటే మైదాన వ్యాపారులే ముందున్నారు. దళారీ వ్యాపారులే సిండికేట్‌గా మారి ధరలు తగ్గించి అత్యధికంగా చీపుర్లు కొనుగోలు చేసుకుంటున్నారు. ఒక్కో కొండచీపురు రూ.30 నుంచి 50 మధ్య బల్క్‌గా గిరిజనుల నుంచి వ్యాపారులు కొనుగోలు చేసుకుని విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, తెలంగాణ, ఒడిశా ప్రాంతాలకు తీసుకువెళ్లి విక్రయిస్తున్నారు. ఒక్కో చీపురుపై కనీసం రూ.10 వరకు లాభాలనార్జిస్తున్నారు.

కొనుగోలు ఆరంభించని జీసీసీ

వాస్తవానికి అటవీ ఉత్పత్తులన్నీ జీసీసీ కొనుగోలు చేయాలి. ముఖ్యంగా కొండ చీపుర్లు ప్రతీ ఏటా కొనుగోలు చేస్తుంటారు. ఇటీవల కాలంలో జీసీసీ కొనుగోలు చేయడం తగ్గించారు. దీనికి ప్రధాన కారణం వీరు కొనుగోలు చేసిన వాటిని బయట మార్కెట్‌లో విక్రయించలేకపోవడం తదితర కారణాలతో వెనుకంజ వేస్తున్నారు. గతంలో కొనుగోలు చేసి బీఎస్ఎఫ్, మిలటరీ స్థావరాలకు విక్రయించేవారు. ఇప్పుడు అటువంటిది ఏమీ లేదు. 2022 – 23లో 1,36,857 కొండచీపుర్లు కొనుగోలు చేయగా, 2023 – 24లో 9,492 చీపుర్లు మాత్రమే కొనుగోలు చేశారు. ఈ సంవత్సరం ఇంతవరకు కొనుగోలు ప్రారంభించలేదు. కొత్త ధరలను మాత్రం జీసీసీ ప్రకటించింది. గ్రేడ్‌లుగా విభజించి గ్రేడ్ వన్ రూ.45, గ్రేడ్ 2 రూ.40, గ్రేడ్ త్రీ రూ.35లకు కొనుగోలు చేయాలని నిర్ణయించారు.



వారపు సంతకు కొండచీపుర్లు తరలిస్తున్న మహిళలు

కొండచీపుర్లు కొనుగోలుకు చర్యలు



కొండచీపుర్లు కొనుగోలుకు చర్యలు తీసుకుంటాం. జనవరి నుంచి సీజన్ ఆరంభం అవుతుంది. ప్రస్తుతం వీడీవీకేల ద్వారా కొండచీపుర్లు తయారు చేయించి మార్కెట్ సౌకర్యం కల్పిస్తున్నాం. కొండచీపుర్ల కట్టర్లు, టైలరింగ్ మిషన్లు ఇవ్వనున్నాం.

– జి.సంధ్యారాణి, జీసీసీ జనరల్ మేనేజర్

సామూహిక అక్షరాభ్యాసాలు



సామూహిక అక్షరాభ్యాసం చేయిస్తున్న అర్చకులు సాయికృష్ణ శర్మ

సీతంపేట: స్థానిక సంతోషిమాత ఆలయంలో బుధవారం చిన్నారుల సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. అర్చకులు వేమకోటి సాయికృష్ణశర్మ ఆధ్వర్యంలో పుస్తకపూజ, కుంకుమ పూజలు చేశారు.

కూరగాయల సాగుపై రైతుల ఆసక్తి



కుమ్మరిగుంటలో టెల్లీస్ విధానంలో సాగుచేస్తున్న టమోటా పంట

కొమరాడ: కూరగాయ పంటలకు మార్కెట్లో గిట్టుబాటు ధర లభిస్తుండంతో కూరగాయల సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. మెట్టు, పల్లం భూములనే తేడాలేకుండా నీరు అందుబాటులో ఉన్నచోట్ల సేంద్రియ ఎరువులు వినియోగించి పంటలు సాగుచేస్తున్నారు. మండలంలోని కొమరాడ, కళ్లికోట, దుగ్గి, గుణానపురం, గంగారేగువలస, కుమ్మరిగుంట, కందివలస, దళాయపీట, తొడుమ స్వామినాయుడువలస, కోదలగుంప తదితర గ్రామాల్లో వంగ, మిరప, చిక్కుడు, కాకర, టమోటో బీర, బెండ, తదితర కూరగాయ పంటలు, ఆకుకూర పంటలు సాగుచేస్తున్నారు. టెల్లీస్ విధానంలో టమోటాలు, పందిళ్లపై పాదుజాతి కూరగాయలను సాగుచేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నారు. మండలంలో సుమారు వెయ్యి ఎకరాల్లో కూరగాయ పంటలు సాగులో ఉన్నాయి. మెట్టు ప్రాంతాలు, వరిపంట పొల్లాల గట్లుపై కూడా కూరగాయలు సాగు చేస్తూ రైతులు అదనపు ఆదాయం ఆర్జిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లో కూరగాయల ధరలు బాగుండటంతో అధిక ఆదాయం వస్తోందని రైతులు అంటున్నారు. కళ్లికోట, కుమ్మరిగుంట కూరగాయలకు పార్వతీపురం మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. అలాగే ఈ ప్రాంత నుంచి ఒడిశా, రాయిపూర్ వంటి ఇతర రాష్ట్రలకు కూరగాయలను ఎగుమతి చేస్తున్నారు.

ప్రజలపై విద్యుత్ చార్జీల మోత తగదు

పాలకొండ రూరల్: ఏపీలో కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల మోత మోగించేందుకు సిద్ధమవుతుందని అభ్యుదయ రైతు కండాపు ప్రసాదరావు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ముందు విద్యుత్ చార్జీల పెంపు ఉండదని, నాణ్యమైన విద్యుత్ మరింత మెరుగ్గా అందిస్తామని చెప్పి కూటమి నేతలు ఇప్పుడు ఆ మాటలను మరిచారని విమర్శించారు. నానాటికి పెరుగుతున్న ధరాభారానికి తోడు విద్యుత్ చార్జీలు పెంచితే ప్రజలపై మరింత భారం తప్పదని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు విద్యుత్ చార్జీల పెంపు విషయంలో పునరాలోచన చేయాలని సూచించారు. లేకుంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

గర్భిణులకు అన్నసమారాధన

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో బుధవారం గర్భిణులకు అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీలో పీఎంఎస్ఎంఏ పథకం కింద ప్రతీ నెల 9వ తేదీన వైద్య తనిఖీల కోసం వచ్చే గర్భిణులకు బాబా భక్తులు పౌష్టికాహారం అందిస్తున్నారు. ఇందులో భాగంగా బురద వెంకటాపురం గ్రామానికి చెందిన బొత్స శివున్నాయుడు గౌరమ్మ దంపతులు, శ్రీహరిరావు ఇంద్రాణి దంపతులు గర్భిణులకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఆలయంలో దాతల సహకారంతో గర్భిణులకు అన్నదానం ఏర్పాటుచేయడం పట్ల పీహెచ్‌సీ వైద్యాధికారు కేకే సాగర్‌వర్మ, సంతోష్ కుమార్ అభినందనలు తెలియజేశారు.



భోజనాలు చేస్తున్న గర్భిణులు

సేంద్రియ వ్యవసాయంతో లాభాలు



రైతుల సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ రత్నకుమారి

భామిని: సేంద్రీయ వ్యవసాయంతోనే సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందని, నేలతల్లికి కూడా మేలు జరుగుతుందని వ్యవసాయ సహాయ సంచాలకులు కె.రత్నకుమారి అన్నారు. భామిని, బొడ్డగూడ గ్రామాల్లో ఎంఏఓ కె.సింహాచలం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సేంద్రీయ వ్యవసాయం ద్వారా బహుళ ప్రయోజనాలు ఉన్నాయని చెప్పారు. ఈ సాగు పద్ధతిలో తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు సాధించవచ్చన్నారు. ముందుగా బొడ్డగూడలో వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో చేస్తున్న సేంద్రీయ వ్యవసాయ పంటలను రైతులతో కలిసి పరిశీలించారు. వ్యవసాయ సహాయకుడు ఎర్రన్న, ఫిషరీస్ సహాయకుడు ఆదినారాయణ, గిరిజన రైతులు పాల్గొన్నారు.

నాటు కోడి రూ.3000



రూ.3వేలు పలికిన నాటుకోడి

పాలకొండ రూరల్: దసరా పండగ వచ్చిందంటేనే పిండి వంటలు, సంబరాలు, అమ్మవారికి కోళ్లు, గొర్రెలు, మేకలను చూపించి మొక్కులు చెల్లించడం. ఈ నేపథ్యంలో కోళ్లు, గొర్రెలు, మేకల ధరలు కొనుగోలుదారులను హడలెత్తిస్తున్నాయి. చికెన్ ధర కిలో రూ.250 నుంచి 300 మధ్య ఉండగా మటన్ కిలో రూ.900 పైచిలుకు పలుకుతుంది. ఇదిలా ఉంటే నాటు కోడి చిన్నదైనా.. పెద్దదైనా ధర మాత్రం రెక్కలు కట్టుకుని ఎగురుతుంది. బుధవారం పాలకొండలో జరిగిన వారపు సంతలో మోస్తరు నాటు కోడి ధర రూ.3000 పలికింది. కొనుగోలుదారులు మొక్కులు చెల్లించే క్రమంలో ఇష్టం లేకున్నా అధిక ధరకు కొనుగోలు చేయాల్సి వచ్చింది. మరోవైపు నిత్యావసర ధరలు, ఇంకోవైపు కూరగాయల ధరలు వినియోగదారులను కంట నీరు తెప్పిస్తున్నాయి. దసరా పండగ వ్యాపారులకు కలిసొస్తుండగా ప్రజలకు మాత్రం ధరల రూపంలో చుక్కలు చూపిస్తోంది.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ



అడారు గ్రామంలో విచారణ చేస్తున్న డీఎస్పీ రాంబాబు

వీరఘట్టం: మండలంలోని అడారు గ్రామానికి చెందిన ఎస్.యోగిన్నదొరను అదే గ్రామానికి చెందిన ఎం.హరి, భాను ఈ నెల 5న కులం పేరుతో దూషించి, కర్రతో దాడి చేసి తలపై గాయం చేశారని వచ్చిన ఫిర్యాదుపై ఈ నెల 6న అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జి.కళాధర్ తెలిపారు. ఈ కేసును విచారించేందుకు పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు అడారు గ్రామానికి బుధవారం వెళ్లారు. బాధితుని నుంచి, సాక్షుల నుంచి కేసుకు సంబంధించి వివరాలు సేకరించారు.

వరికి మూషికాలతో ముప్పు



పొట్ట దశలో ఎలుకల బారిన పడుతున్న వరి పంట

- పంటలను దెబ్బతీస్తున్న ఎలుకల గుంపులు
- దిగుబడిపై తీవ్ర ప్రభావం
- సామూహిక నివారణ చర్యలతో ప్రయోజనం

పాలకొండ రూరల్: అన్నదాత ఆరుగాలం కష్టించి పండిస్తున్న పంటలపై మూషికాలు దాడి చేస్తూ ముప్పుతిప్పలు పెడుతున్నాయి. ప్రస్తుతం ఖరీఫ్ వరి వంట పొట్ట దశకు చేరుకుంటున్న తరుణంలో తీపిగా ఉండే దుబ్బు, పిలకలను ఎలుకలు తినేస్తుండటంతో దిగుబడిపై ప్రభావం పడుతుంది. మూషికాల బారి నుంచి వరి పైరును ఎలా సంరక్షించుకోవాలో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు కె.రత్నకుమారి వివరించారు. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో లక్షా70వేల హెక్టార్లలో వరి సాగు చేశారు. వర్షాభావ పరిస్థితి కారణంగా ఆగస్టు చివరి నాటికి ఊడుపులు పూర్తయ్యాయి. చాలా చోట్ల వెదజల్లు పద్ధతి అవలంభించడంతో అవి వేగంగా పెరిగి దుబ్బు కట్టే దశకు చేరుకున్నాయి. పిలకలు పొట్ట తీపిగా ఉండడంతో ఎలుకలు వాటిని కొరికి బొరియల్లోకి తీసుకెళ్తున్నాయి. దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో నివారణపై దృష్టి పెట్టాల్సి ఉంటుంది.

నివారణకు ఏం చేయాలంటే..

గ్రామంలోని రైతులంతా సామూహిక ఎలుకల నివారణకు చర్యలు చేపట్టాలి. సామూహిక ఎలుకల నివారణకు బ్రోమోడయాలిన్ రెండు శాతం మందును ఉపయోగించి సత్ఫలితాలను పొందవచ్చు. బ్రోమోడయాలిన్ 0.25 మిల్లీలీటర్ల ఎలుకల మందు రెండు శాతం విషపు ఎరగా తయారీ చేసుకోవడం కోసం 96 శాతం నూకలు, రెండు గ్రాముల నూనె, రెండు గ్రాముల బ్రోమోడయోలిన్ మందును కలపాలి. ఒక్కో ఎలుక బొరియకు 10 గ్రాముల ఎరను కాగితంలో పొట్లంగా చుట్టి బొరియల్లో అంగుళం లోపల పెట్టాలి. పొట్లాలు అమర్చిన అనంతరం బొరియను మూసి వేయకూడదు. భారీ, మోస్తరు వర్షం గానీ వస్తే వర్షం ఆగే వరకూ చూడాలి. లేదంటే మరుసటి రోజుకు వాయిదా వేయాలి. ఎర మందు వర్షంలో తడిస్తే సరిగా పని చేయదు. కలిపిన ఎర మందు 12 గంటలు దాటితే ఆ వాసనను ఎలుకలు పసిగడతాయి. కాబట్టే ఈ విశ్రమాన్ని మధ్యాహ్నం కలిపి సాయంత్రంలోపు అమర్చాలి. ఎలుకలు నిశాచరులు కాబట్టి సాయంత్రం నుంచి మరుసటి రోజు ఉదయం వరకూ స్వీకరించే అవకాశం ఉంది. మందు తిన్న నాలుగు నుంచి ఐదు రోజుల్లో ఎలుక చనిపోతుంది.

పొగ పెట్టాలి

పొగబారించే యంత్రం (బర్రోఫ్యూమి గేటర్)తో ఎలుక బొరియలను కప్పి రెండు నుంచి మూడు నిమిషాలు పొగ పెడితే వాటిలో ఉంటే తల్లి, పిల్ల ఎలుకలు పూర్తిగా చనిపోతాయి. తొలకరి చినుకుల అనంతరం పంట భూమిని దుక్కి చేయాలి. రైతులు పొలం గట్లపై కాకుండా పోరంబోకు భూములు, ఖాళీ ప్రదేశాల్లో విషపు ఎరను పెట్టి ఎలుకల నివారణ చర్యలు చేపట్టాలి. ఎలుక బొరియలను ఎప్పటికప్పుడు గమనిస్తూ పొగ పెట్టడం మంచిది.

నివారణే సరైన మార్గం



వరి పంట కీలక దశలో ఎలుకల కారణంగా తీవ్ర నష్టం జరుగుతోంది. రైతులు దీనిపై దృష్టి సారించి సామూహికంగా ఎలుకలను నిర్మూలించేలా చర్యలు చేపట్టాలి. ఇందుకు ఎన్నో పద్ధతులు ఉన్నాయి. వ్యవసాయాధికారుల సూచనల మేరకు రైతులు చర్యలు తీసుకోవాలి. – కె.రత్నకుమారి, వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు, పాలకొండ

పంచాయతీల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



గరుగుబిల్లి: శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ గోపాలరావు



కొమరాడ: మాట్లాడుతున్న ఎంపీపీ శెట్టి శ్యామల

గరుగుబిల్లి: గ్రామ పంచాయతీల అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని ఎంపీడీఓ జి.పైడితల్లి అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు రెండో విడత శిక్షణా తరగతులను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు మాట్లాడుతూ.. ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యుల విధులు, బాధ్యతలు, అధికారాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. అధికారులు, ప్రజల సహకారంతో గ్రామాభివృద్ధికి కృషిచేయాలన్నారు. ఏఓ ఎస్.అర్జునరావు, ఏపీఓ గౌరీనాథ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులు వినియోగించుకోవాలి..

కొమరాడ: పంచాయతీ పరిపాలన శిక్షణ తరగతులు వినియోగించుకోవాలని ఎంపీపీ శెట్టి శ్యామల అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని 31 పంచాయతీల ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు శిక్షణ తరగతులను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఆర్పీ మహ్మద్‌రఫీ గ్రామ పంచాయతీలో ఉన్న వనరుల గుర్తింపు, వాటిని ఎలా సద్వినియోగం చేసుకోవాలి, పంచాయతీ ఆదాయం ఏవిధంగా పెంచాలి, పంచాయతీ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై, ఏపీపీఆర్ చట్టం–1994 నిబంధనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జెట్పీటీసీ ద్వార పురెడ్డి లక్ష్మి, ఏఓ ఎస్.రమేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి బీమయ్య, తదితరులు పాల్గున్నారు.

సరస్వతీదేవిగా దర్శనమిచ్చిన దుర్గమ్మ



భామిని: కీసరలో దేవీ సన్నిధిలో సరస్వతి పూజల్లో పాల్గొన్న భక్తులు



వీరఘట్టం: ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన వీరఘట్టం శ్రీకోటదుర్గతల్లి



పాలకొండ: సరస్వతీదేవిగా దర్శనమిచ్చిన కోటదుర్గమ్మ

పాలకొండ:

ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పాలకొండ శ్రీకోటదుర్గమ్మ దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా బుధవారం భక్తులకు సరస్వతీదేవిగా దర్శనమిచ్చింది. ఉదయం 3 గంటల నుంచి దేవి దర్శనం కోసం భక్తులు క్యూ కట్టడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దుర్గమ్మను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

జననీ నమోస్తుతే...

వీరఘట్టం: వీరఘట్టంలో వెలసిన శ్రీకోట దుర్గ తల్లికి బుధవారం దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమివ్వడంతో తల్లిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. పలువురు చిన్నారులచే అర్చకులు అక్షరాభ్యాసం చేయించారు.



గరుగుబిల్లి: పెద్దూరులో సరస్వతీదేవీ పూజల్లో పాల్గొన్న చిన్నారులు

శ్రీవాణీ నమస్తుభ్యం..

భామిని: శ్రీ వాణీ నమస్తుభ్యం అంటూ పిల్లలు చదువులు తల్లి అనుగ్రహించాలని కోరుతూ బుధవారం అమ్మవారికి పూజలు చేశారు. భామిని మండలంలో కీసర, బత్తిలి, భామినిలలో దేవీ నవరాత్రులలో ఏడవ రోజు మూలా నక్షత్రం సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గరుగుబిల్లి: శరన్నవరాత్రి మహోత్సవంలో భాగంగా మండలంలోని గరుగుబిల్లి, పెద్దూరు, రావుపల్లి, రావివలస తదితర గ్రామాలలోని దుర్గాదేవీ ఆలయంలో బుధవారం అమ్మవారిని సరస్వతీదేవీగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పెద్దూరులోని దుర్గగుడిలో అర్చకులు అంపోలు వెంకటరమణ శర్మ చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసాలు చేయించారు. భవానీ స్వాముల భజనతో అమ్మవారి మండపాలు మార్మోగాయి.

మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఏకగ్రీవం

మక్కువ: స్థానిక సచివాలయంలో శ్రీ పోలమాంబ స్వదేశీ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాలకవర్గం సభ్యులుగా తాతపూడి.సత్యనారాయణ, బోరబంద.శివుడు, రౌతు సింహాచలం, దుగ్గాడ తిరుపతి, మామిడి.సూరన్న దొర, మరడాన రాము.అమరకంట జగన్నాథం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పాలకవర్గ సభ్యులకు ఎన్నికల అధికారి పి.రమాదేవి ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేశారు.